రక్తమోడుతున్న జాతీయ రహదారి

- 9 నెలల్లో 20కుపైగా ప్రమాదాలు
- ఆరుగురు మృత్యువాత.. పదుల సంఖ్యలో గాయాల పాలు
- ద్విచక్ర వాహనచోదకులే అధికం
- హెల్మెట్ ధరించకపోవడంతోనే మృత్యువాత


లారీని ఢీకొన్న ద్విచక్ర వాహనం(ఇన్‌సెట్లో)హెల్మెట్ లేక మృత్యువుపాలైన ద్విచక్ర వాహనచోదకుడు

సంగం: నెల్లూరు–ముంబై జాతీయ రహదారి రక్త మోడుతోంది. అతివేగం..నిద్రలేమి..ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం తదితర కారణాలతో ఎక్కువగా ప్రమాదాల చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా ద్విచక్రవాహన చోదకులు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతుండడం ఆందోళన కలిగిస్తున్న విషయం. అతివేగం..హెల్మెట్లు ధరించకపోవడం వల్లే మత్యువు పాలవుతున్నారు. హైవేపై పోలీసులు తరచూ తనిఖీలు చేపడుతూ అవగాహన కల్పిస్తున్నారు. అయినా వారి మాటలను ద్విచక్ర వాహనచోదకులు పెడచెవిన పెడుతుండడంతో ప్రమాదాలు తగ్గుముఖం పట్టడం లేదు. మండలంలోని జెండాదిబ్బ నుంచి కోలగట్ల వరకు 15 కిలోమీటర్ల మేర నెల్లూరు–ముంబై జాతీయ రహదారి విస్తరించి ఉంది. ఈ రహదారిపై ప్రతి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధానంగా ద్విచక్ర వాహనచోదకులు ఎక్కువగా ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ ఏడాది 9 నెలల కాలంలో 20కుపైగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా, ఆరుగురు మృత్యువాత పడ్డారు. పదుల సంఖ్యలో గాయాలపాలయ్యారు.

అతివేగం..హెల్మెట్లు ధరించకపోవడం..హైవే ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా మార్జిన్‌కు బదులు నడిరోడ్డుపై ప్రయాణించడం..వాహనాలను వేగంగా ఓవర్ టేక్ చేయడం..తదితర కారణాలతో ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. పోలీసులు అధికారుల తరచూ తనిఖీలు నిర్వహిస్తూ కౌన్సిలింగ్ ఇస్తున్నారు. అయినా ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్లు ధరించకపోతుండడంతో ప్రమాదాల్లో గాయపడి మృత్యువుపాలవుతున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



ముంబై జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. సంగం చెక్ పోస్టు వద్ద నిత్యం వాహనాల తనిఖీలు చేపడుతున్నాం. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నాం. ద్విచక్ర వాహనచోదకులే ఎక్కువగా ప్రమాదాల బారిన పడుతున్నారు. అందుకే హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనచోదకులపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం.

–వేమారెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, సంగం

9 నెలల్లో జరిగిన ప్రమాద ఘటనలు

- జనవరి 5న సంగం సమీపంలో కారును ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. అదే నెల 14న ఆటోను వేగంగా ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న కారును ఢీకొని ఓ యువకుడు మృత్యువు పాలయ్యాడు. అదే నెల 18వ తేదీ కారు వేగంగా వెళ్తూ అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటనలో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు.
- ఫిబ్రవరి 5న సంగం సమీపంలో కారును ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనచోదకుడు తీవ్రంగా గాయపడ్డాడు. అదే నెల 22వ తేదీ బైక్‌ను ఆటో ఢీకొన్న ఘటనలో దంపతులు గాయపడ్డారు.
- మార్చి 10వ తేదీ దువ్వూరు సమీపంలో బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. అదే నెల 17వ తేదీ సంగం బీరాపేరు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు.
- ఏప్రిల్ 15వ తేదీ బీరాపేరు వద్ద మితిమీరిన వేగంతో బైక్, కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. అందులో ఓ యువకుడు నెల్లూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.
- మే 16వ తేదీ పెరమన వద్ద ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనచోదకుడు మృతి చెందాడు. అదే రోజు ఆటోను బుచ్చిరెడ్డిపాళెం వైపు వెళ్తున్న కారు ఢీకొని మహిళ తీవ్రంగా గాయపడింది. అదే నెల 20వ తేదీ పెరమన సమీపంలో లారీని బైక్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు.
- జూన్ 14న దువ్వూరు వద్ద గేదెలను తప్పించబోయి మినీవ్యాన్ బోల్తాపడిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృత్యువుపాలయ్యారు. జూన్ 30న తరుణవాయి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనచోదకుడు తీవ్రంగా గాయపడ్డాడు.
- ఆగస్టు 18న సిద్దీపురం వద్ద ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనచోదకుడు గాయపడ్డాడు. అదేరోజు సంగం వద్ద బైక్ అదుపు తప్పి ద్విచక్ర వాహనచోదకుడు తీవ్రంగా గాయపడ్డాడు.

క్లుప్తంగా

వైభవంగా గంధోత్సవం



సంగం: మిలాద్–ఉన్–నబీ వేడుకల్లో భాగంగా దువ్వూరులో ఉన్న అస్తానా ఏ నూరియా దర్గాలో గంధ మహోత్సవాన్ని శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతి అల్ హజ్ షేక్ పాబాషా నూరిసాహెబ్ ఆధ్వర్యంలో తొలుత గంధాన్ని గ్రామంలో ఊరేగించారు. అనంతరం దర్గాకు చేర్చి ప్రత్యేక ప్రార్థనలు జరిపి భక్తులకు పంచిపెట్టారు. అన్నప్రసాద వితరణ చేశారు.

చిన్నారి మానవత్వం



సీతారామపురం: స్థానిక గౌతమి హైస్కూల్‌కు చెందిన ఆరో తరగతి విద్యార్థి నీలి వెంకటహేమస్వరూప్ తన మానవత్వాన్ని చాటుకున్నాడు. తన పుట్టినరోజు వేడుకల కోసం దాచుకున్న రూ.2,223 నగదును విజయవాడ వరద బాధితులకు అందజేశారు. శనివారం మారంరెడ్డిపల్లి ఎస్సీ కాలనీ పర్యటించిన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు నగదు చెక్కు అందజేశాడు. విద్యార్థి ఉదార స్వభావాన్ని పలువురు అభినందించారు.

వరద బాధితులకు దుప్పట్ల పంపిణీ



ఉదయగిరి: విజయవాడలోని వరద బాధితులకు ఆంధ్రప్రదేశ్ వలంటీర్ హెల్త్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం దుప్పట్లు, టవళ్లు పంపిణీ చేశారు. పాత రాజరాజేశ్వరిపేటలోని 250 కుటుంబాలకు వలంటీర్ హెల్త్ అసోసియేషన్ శాశ్వత సభ్యుడు, ఫన్డ్స్ సంస్థ డైరెక్టర్ పీవీ రమణయ్య ఆధ్వర్యంలో సభ్యులు దుప్పట్లు, టవళ్లు అందజేశారు.

ఆర్ఎస్సార్‌లో అథ్లెటిక్ మీట్

బిట్రగుంట: బోగోలు మండలం కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో స్పోర్ట్స్ డేను పురస్కరించుకుని శనివారం అథ్లెటిక్ మీట్ నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులకు వేర్వేరుగా డిస్క్‌త్రో, జావెలిన్ త్రో, రన్నింగ్ రేస్, రిలే రన్నింగ్ రేస్, తదితర పోటీలు నిర్వహించగా ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు స్పోర్ట్స్‌డే రోజున బహుమతులు అందచేయనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పీవీఎస్ రెడ్డి తెలిపారు. ఏఓ ఆర్వీ రమణారెడ్డి,పీడీ ఏ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక వైద్యశిబిరం

ఆత్మకూరు: స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో సోమవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ శేషారత్నం శనివారం తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించే శిబిరంలో అన్ని రకాల వైద్యపరీక్షలు చేస్తామని చెప్పారు. రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు



కొండాపురం: కొమ్మి–చౌడవరం మధ్యన శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొమ్మి పంచాయతీ చెందిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డాడు. కొమ్మి నుంచి కావలికి వెళుతుండగా బైక్ అదుపుతప్పి కింద పడిపోవడంతో శ్రీనివాసులు తలకు బలమైన గాయమైంది. క్షతగాత్రుడ్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

ఇంట్లో చోరీ

అనుమసముద్రంపేట: స్థానిక దర్గా ప్రాంతంలోని ఓ ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఎస్సై సైదులు తెలిపిన సమాచారం మేరకు.. దర్గా సమీపంలో హబీబా అనే వృద్ధురాలు నివాసం ఉంటుంది. శుక్రవారం రాత్రి ఆమె నిద్రకు ఉపక్రమించగా, అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి బీరువా తెరిచి దాదాపు రూ.లక్ష విలువైన నగదు, వెండి గొలుసులు అపహరించుకుని వెళ్లారు. ఉదయం నిద్రలేచిన హబీబా బీరువా తెరిచి ఉండడం , అందులోని నగలు, డబ్బులు లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుల సమావేశం

ఆత్మకూరు: పట్టణంలోని యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో విశ్రాంత ఉపాధ్యాయ సంఘ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్లను అందజేయాలని సంఘ నాయకుడు సుధాకర్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. సంఘ నాయకులు రమణయ్య, సలాం, తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహకాల ప్రదానం



సంగం: తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ప్రతిభా ప్రోత్సాహకాలను శనివారం అందజేశారు. గ్రామానికి చెందిన కాట్లూరి చంద్రశేఖర్‌రెడ్డి, సుగుణమ్మ దంపతుల జ్ఞాపకార్థంగా కుమారుడు శేషారెడ్డి, మాధవి దంపతులు ఆరు నుంచి పదో తరగతి వరకు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు మొత్తం రూ.27 వేలు ప్రోత్సాహకంగా అందజేశారు. అనంతరం విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేశారు.

దాడి కేసులో నిందితుడి అరెస్ట్

చేజర్ల: దంపతులపై దాడి చేసి గాయపరిచిన కేసులో నిందితుడ్ని శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. ఈ నెల 11న గణేశ్ నిమజ్జన ఉత్సవాల సందర్భంగా మండలంలోని టీకేపాడుకు చెందిన కృష్ణమూర్తి దంపతులపై అదే గ్రామాలకు చెందిన కనమల బాలఓబులు దాడి చేసి గాయపరిచాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు చెప్పారు. శనివారం నిందితుడ్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

ధ్యాన శిక్షణ

ఆత్మకూరు: ధ్యానంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ధ్యాన మాస్టర్ మోరంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. పట్టణంలోని గాయత్రి, శ్రీనివాస, తదితర పాఠశాలల్లోని విద్యార్థులకు షిర్డీ సాయి పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో ధ్యానంపై శిక్షణా తరగతులను శనివారం నిర్వహించారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు


భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగరాజు

దుత్తలూరు: ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వై నాగరాజు హెచ్చరించారు. బ్రహ్మేశ్వరం సమీపంలోని ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమిస్తున్నారని సర్పంచ్ మీసాల సుబ్బరాయుడు గ్రామస్తులతో కలిసి తహసీల్దార్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో భూములను తహసీల్దార్ శనివారం పరిశీలించారు. ఓ రైతు కొంత ప్రభుత్వ భూమిని ఆక్రమించి చదును చేయడం గమనించి ప్రభుత్వ భూమిలోకి ప్రవేశిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవడమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట వీఆర్వో మల్లేశ్వరరావు, సర్వేయర్ మోహన్‌రెడ్డి ఉన్నారు.

కేన్సర్ బాధిత చిన్నారికి దాతలు సాయం


మర్రిపాడు: రూ.25వేలు అందచేస్తున్న ఎస్‌కె మహబూబ్ సాహెబ్ దంపతులు


ఆత్మకూరు: చిన్నారికి ఆర్థిక సాయం అందజేస్తున్న డాక్టర్ ప్రణీత్

మర్రిపాడు/ఆత్మకూరు: మర్రిపాడుకు చెందిన కేన్సర్ బాధిత చిన్నారి హబీబాకు వైద్యఖర్చుల నిమిత్తం పలువురు దాతలు ముందుకొచ్చి ఆర్థిక సాయం అందజేస్తున్నారు. చిన్నారి తండ్రి మస్తాన్ మర్రిపాడులో టీ దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇప్పటికే తన స్థాయికి మించి వేలాది రూపాయలు అప్పులు చేసి కుమార్తెకు వైద్యం అందించారు. చిన్నారి వైద్యానికి రూ.10 లక్షల వరకు అవసరం కాగా నిరుపేద కుటుంబం దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ విషయమై ఈ నెల 13న 'సాక్షి'లో కథనం రావడంతో పలువురు దాతలు ముందుకొచ్చి సాయం అందజేస్తున్నారు. శనివారం మర్రిపాడుకు చెందిన ఎస్కే మహబూబ్‌సాహెబ్ దంపతులు రూ.25వేలు సాయం అందజేశారు. అలాగే ఏపిలగుంట రోడ్డు ఆటో యూనియన్ సభ్యులు రూ.7వేలు సాయం అందజేశారు. ఆత్మకూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, డాక్టర్ వింజం దొరసానమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ప్రణీత్ రూ.20వేలు సాయాన్ని అందజేశారు. ట్రస్ట్ సభ్యులు డాక్టర్ మెంటా సందీప్, డాక్టర్ కుమార్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

తీరంలో స్వచ్ఛ సాగర్ సురక్షిత్ సాగర్



కావలి: అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌కు చెందిన ఇన్‌కాయిస్ సంస్థ, మత్స్యకార సంక్షేమ సమితి సంయుక్త ఆధ్వర్యంలో తుమ్మలపెంట తీరంలో స్వచ్ఛ సాగర్ సురక్షిత్ సాగర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. తీరంలోని చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ముఖ్యమైన వనరుల్లో సముద్రం ఒకటని, కాలుష్యం బారి నుంచి కోట్లాది జలజీవరాసులను కాపాడుకునేందుకు సముద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను సముద్రంలో వేయడం వల్ల సముద్రజీవులు నాశనం అవుతున్న తీరును వివరించారు. మత్స్య కారుల జీవనోపాధికి గండిపడుతుందని తెలిపారు. సముద్ర సమాచార సేవలను అందించడంలో ఇన్‌కాయిస్ సంస్థ పాత్రను ఆ సంస్థ ప్రతినిధి శివకుమార్ వివరించారు. సాధ్యమైనంతగా సముద్రాన్ని కలుషితం కాకుండా చూడాలన్నారు. కావలి మత్స్యశాఖ ఏడీ శ్రీనివాస్, మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర నాయకులు లక్ష్మీనారాయణ, మత్స్యకార జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వేణు పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత దరిచేరదు


మర్రిపాడు: బీసీకాలనీలో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

సీతారామపురం: కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చని ఉదయగిరి సీడీపీఓ పచ్చవ లావణ్య పేర్కొన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా బసినేనిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని కిశోర బాలికలకు శనివారం పోషకాహారంపై అవగాహన కల్పించారు. కిశోర బాలికల మానసిక, శారీరక ఎదుగుదలకు విటమిన్స్, మినరల్స్, కాల్షియం, ఐరన్ ఎంతో అవసరమన్నారు. ఐరన్ ఎక్కువగా ఉండే బలమైన ఆహారం తీసుకున్నప్పుడు రక్తహీనత రాదన్నారు. బాలికల ఆరోగ్యం సమాజానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. హెచ్ఎం అంజయ్య, యాక్టింగ్ సూపర్‌వైజర్ రత్తమ్మ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సీడీపీఓ సునీలత ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాడు: స్థానిక బీసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పోషకాహార మాసోత్సవంలో ఆత్మకూరు సీడీపీఓ పద్మావతి పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధ, అంగన్‌వాడీలు చంద్రకళ, కాంతికుమారి, హెల్పర్లు లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



ఆత్మకూరు: మున్సిపల్ నూతన కమిషనర్ గంగాప్రసాద్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు, కౌన్సిలర్లు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య నేతృత్వంలో కమిషనర్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. మున్సిపాలిటీలోని పరిస్థితులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. నాయకులు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, ముజీబ్, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, టీ రవీంద్రారెడ్డి, ఎస్ ప్రసాద్, కౌన్సిలర్లు కామాక్షయ్యనాయుడు, తిరుపతమ్మ, గుడి సంధ్య, రాధిక, నోటి విజయజ్యోతి, షేక్ మహబూబ్‌బాషా, రాజశేఖర్, కొండా చిన్నవెంకటేశ్వర్లు, నందవరం ప్రతాప్ పాల్గొన్నారు.

గురజాడకు నివాళి



సోమశిల: చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మహాకవి గురజాడ అప్పారావు జయంతిని శనివారం నిర్వహించారు. హెచ్ఎం సురేష్ ఆధ్వర్యంలో గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గురజాడ తన రచనల ద్వారా సమాజంలో నెలకొన్న కన్యాశుల్కం, బాల్య వివాహాలు వంటి దురాచారాలను రూపమాపడానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఉపాధ్యాయులు మహేష్, వెంకటేశ్వర్లు, రాజు, కృష్ణారెడ్డి, సురేష్, మాధవి, శివకృష్ణ, లక్ష్మి పాల్గొన్నారు.

మెరుగైన పాలనే లక్ష్యం



సీతారామపురం: రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ మెరుగైన పాలన అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మండలంలోని మారంరెడ్డిపల్లి ఎస్సీ కాలనీ, పబ్బులేటిపల్లి గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. పలువురు దళితులు మాన్యపు భూముల సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా త్వరలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి స్థానిక సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ వెంకటకృష్ణారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ భార్గవీరెడ్డి, ఎంఈఓ మస్తాన్‌వలి, హౌసింగ్ ఏఈ రామకృష్ణారావు, మారంరెడ్డిపల్లి, పబ్బులేటిపల్లి సర్పంచ్‌లు గాజులపల్లి భారతిరెడ్డి, ఆదెయ్య పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



కలిగిరి: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై ఉమాశంకర్ సూచించారు. కలిగిరి ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలు, ఆన్‌లైన్ గేమ్స్, క్రికెట్ బెట్టింగులకు దూరంగా ఉండాలన్నారు. ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు, ట్రాఫిక్ రూల్స్, హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఏఎస్సై రామచంద్రయ్య, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ


కావలి: మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు


వింజమూరులో..

కావలి: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎన్‌సీసీ ఆఫీసర్ తిప్పిరెడ్డి కొండారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వెంగళరావునగర్‌లోని శ్రీపొట్టిశ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 10(ఏ) నావెల్ యూనిట్ ఎన్‌సీసీ క్యాడెట్లు శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10(ఏ) నావెల్ యూనిట్ నెల్లూరు కమాండింగ్ ఆఫీసర్, లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గోదంగవే ఆదేశాల మేరకు వార్షిక సంయోజనలో భాగంగా మొక్కలను నాటడం జరిగిందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. హెచ్ఎం హయ్యాల్ హయ్యామ్, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు అంజాద్అలీ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

వింజమూరు (ఉదయగిరి): వింజమూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సీహెచ్ మాలకొండయ్య ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో ఎస్సార్ఈడీ సేవా సంస్థ ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి వాగాల శ్రీహరి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. నెహ్రూ యువకేంద్ర వింజమూరు బ్లాక్ మెంబర్ షేక్ ఇబ్రహీం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవకోటి మనుగడకు అడవులే ఆధారం

కావలి: జీవకోటి మనుగడకు అడవులే ఆధారమని, వాటి పరిరక్షణ అందరి బాధ్యతని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని వీఎస్‌యూ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం సుశీల ఆధ్వర్యంలో'అడవుల పరిరక్షణ–అభివృద్ధి,సుస్థిర జీవనంపై అవగాహన సదస్సు, సీడ్ బాల్ తయారీ విధానంపై శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రిన్సిపల్ టీ వీరారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు రాష్ట్ర ఇన్‌చార్జి సెక్షన్ ఫారెస్ట్ ఆఫీసర్ ఓ సురేష్, , డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ రాజశేఖర్ ముఖ్యఅతిథులుగా, ఎస్వీయూ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ సీహెచ్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ వీ శైలజ విశిష్ట అతిథులుగా హాజరై ప్రసంగించారు. పర్యావరణ పరిరక్షణలో అడవుల పాత్ర కీలకమన్నారు. అడవులు అంతరించిపోతే జీవవైవిధ్యం దెబ్బతిని జీవకోటి మనుగడకు ముప్పు ఏర్పడుతుందన్నారు. తొలుత సీడ్‌బాల్స్‌ను జపాన్ దేశస్థులు చేశారని, మన దేశంలో నూతనంగా ప్రారంభించారని చెప్పారు. అడవుల అభివృద్ధికి సీడ్‌బాల్స్ ఎంతో దోహదపడుతాయని తెలిపారు. సీడ్‌బాల్ టెక్నాలజీని విద్యార్థులకు పరిచయం చేసేందుకు వర్క్‌షాప్ నిర్వహించిన డాక్టర్ సుశీలను అభినందించారు.

ఉత్సాహంగా..ఉల్లాసంగా



వింజమూరు (ఉదయగిరి): వింజమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మండల స్థాయి స్కూల్ గేమ్స్‌లో భాగంగా శనివారం అండర్–14, 17 బాలబాలికలకు ఖోఖో, వాలీబాల్, చెస్ పోటీలను నిర్వహించారు. బాలబాలికలు ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొని సత్తాచాటారు. మండల స్థాయిలో ప్రతిభకనబర్చిన క్రీడాకారులు సోమవారం నుంచి ఉదయగిరిలో జరిగే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. న్యాయనిర్ణేతలుగా ఎస్ ప్రభాకర్‌రెడ్డి, వెలుగోటి కృష్ణయ్య, ఎం తిరుపాలురెడ్డి, ఆర్ అంజయ్య, రజని విలాసిని, సుమలత, తదితరులు వ్యవహరించారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

ఆత్మకూరురూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గృహ లబ్ధిదారులకు ఈ నెల 28 నుంచి అవగాహన సదస్సులు నిర్వహించి నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో శనివారం ఆయన సమీక్షించారు. ఒక్కో ఇంటికి ప్రభుత్వం మంజూరు చేసే రూ.1.80 లక్షలను దశలవారీగా అందజేస్తామన్నారు. బేస్‌మెంట్ పూర్తి చేసిన వారికి 50 రోజులు, రూఫ్‌లెవల్ పూర్తి చేసిన వారికి 40 రోజుల ఉపాధి పనిదినాలు కల్పిస్తామన్నారు. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రతి పంచాయతీ పరిధిలోని లబ్ధిదారులను గుర్తించి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ శరత్ పాల్గొన్నారు.

ఆశ వర్కర్‌పై సర్పంచ్ వేధింపులు ఆపాలి


నిరసన వ్యక్తం చేస్తున్న ఆశ కార్యకర్తలు

కలిగిరి: దళిత మహిళ, ఆశ వర్కర్ పందిటి విజయమ్మపై సర్పంచ్ వేధింపులను వెంటనే ఆపి విధుల్లో కొనసాగించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అరుణమ్మ హెచ్చరించారు. ఆశ కార్యకర్త విజయమ్మను విధుల నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ శనివారం కలిగిరిలోని ప్రాథమిక ఆరోగ్యం వద్ద ధర్నా చేశారు. ఆమె మాట్లాడుతూ రావులకొల్లు ఆశ కార్యకర్తగా విజయమ్మ 18 ఏళ్లుగా ఎంతో అంకితభావంతో పని చేస్తుందన్నారు. స్థానిక సర్పంచ్ పూసాల వెంగపనాయుడు రాజకీయ వేధింపులకు పాల్పడి విధుల నుంచి తొలగించడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక కొంతమంది నాయకులు చిరు ఉద్యోగులకు వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తమ సమస్యను తీసుకువెళ్లినప్పటికి విజయమ్మను తొలగించడం బాధాకరమన్నారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని, ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా నాయకులు పెంచలయ్య, అరుణ తదితరులు పాల్గొన్నారు.